ప్రజాశక్తి
శుక్రవారం 7 జూన్ 2024
5
శ్రీకాకుళం

బిసి స్టడీ సర్కిల్‌లో గ్రూప్-2 శిక్షణ

శ్రీకాకుళం అర్బన్ : బిసి స్టడీ సర్కిల్ లో గ్రూప్-2 మెయిన్స్ పరీక్షకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు స్టడీ సర్కిల్ ఇడి ఇ.అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. ఎపిపిఎస్‌సి ద్వారా నిర్వహించే గ్రూప్-2 ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల ప్రిలిమినరీ పరీక్షకు అర్హత సాధించి గ్రూప్-2 మెయిన్స్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. ఉచిత శిక్షణకు 60 మంది బిసి, ఇబిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ అభ్యర్థులు ఆఫ్‌లైన్ ద్వారా శ్రీకాకుళం నగరంలోని 80 అడుగుల రోడ్డులో గల బిసి స్టడీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల పదో తేదీ నుంచి నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో శిక్షణా తరగతులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు స్టడీ సర్కిల్ ఫోన్ నంబర్లు 7382975679, 9295653489 సంప్రదించాలని సూచించారు.

అమాత్యులు అయ్యేదెవరో..?

- క్లీన్ ఇమేజ్ ఉన్న వారికే అంటూ అధిష్టానం సంకేతాలు
- యువత, మహిళలకు ప్రాధాన్యంపై చర్చ
- రేసులో అచ్చెన్న, కూన, అశోక్
- కేంద్ర కేబినెట్‌లో రామ్మోహన్ నాయుడికి అవకాశంపై ప్రచారం

అచ్చెన్నాయుడు

బెందాళం అశోక్



శాసనసభ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు క్లీన్‌స్వీప్ చేయడంతో మంత్రి పదువులకు పోటీ పెరిగింది. జిల్లాకు ఎన్ని మంత్రి పదవులు దక్కుతాయనే చర్చ ప్రధానంగా సాగుతోంది. జిల్లాల సంఖ్య పెరగడంతో ప్రతి జిల్లాకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన నేపథ్యంలో 26 జిల్లాలకూ కేటాయించాల్సిన నేపథ్యంలో జిల్లాకు ఒకటి లేదా రెండు కంటే మించి మంత్రి పదవులు దక్కకపోవచ్చన్న చర్చ నడుస్తోంది. సామాజిక సమీకరణాలు, యువత, క్లీన్ ఇమేజ్ ఆధారంగా మంత్రివర్గం కూర్పు ఉంటుందని ఇప్పటికే చంద్రబాబు నాయుడు సంకేతాలు ఇవ్వడంతో, జిల్లాలో ఎవరికి కేబినెట్‌లో బెర్తు దొరకుతుందోనని అటు పార్టీ శ్రేణులతో పాటు అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలోని ఒక ఎంపీ స్థానంతో పాటు ఎనిమిది అసెంబ్లీ స్థానాలను కూటమి కైవసం చేసుకుంది. టిడిపి తరుపున గెలిచిన వారిలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, కూన రవికుమార్, బెందాళం అశోక్, గౌతు శిరీష, బగ్గు రమణమూర్తి, గొండు శంకర్, మామిడి గోవిందరావు ఉన్నారు. బిజెపి తరుపున ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. యువత, మహిళలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పార్టీ అధిష్టానం ఇప్పటికే సంకేతాలు ఇచ్చినట్లు తెలిసింది. టిక్కెట్ల కేటాయింపులోనూ అదే పద్ధతిని అనుసరించిన టిడిపి, కేబినెట్ కూర్పునూ ఆవిధంగానే చేయాలని భావిస్తున్నట్లుగా తెలిసింది. దీంతోపాటు సామాజిక సమీకరణాలనూ పరిగణనలోకి తీసుకోనున్నట్లు తెలుస్తోంది. దీంతో జిల్లాలో పలువురు ఆశావహులు మంత్రి పదవులపై ఆశలు పెట్టుకున్నారు.

అచ్చెన్నకు మంత్రి పదవి వరించేనా?

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు మంత్రి పదవి రేసులో ఉన్నట్లు వార్తలు వస్తున్నా, బెర్తు దక్కడంపై అనేక సందేహాలు వినిపిస్తున్నాయి. యువత, క్లీన్ ఇమేజ్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటే అచ్చెన్నను తీసుకోకపోవచ్చునే చర్చ నడుస్తోంది. అనుభవం, వరుసగా మూడు పర్యాయాలు గెలవడం వంటి అంశాలను లెక్కలోకి తీసుకుంటే మాత్రం పదవి వరించవచ్చునే చర్చ ఆ పార్టీ వర్గాల్లో నడుస్తోంది. దీంతోపాటు ఉమ్మడి జిల్లాలో శ్రీకాకుళం, పాతపట్నం, పాలకొండలో పార్టీలో గ్రూపుల పోరుకు ఆయనే కారకుడనే విమర్శలు పార్టీలో దృష్టిలో ఉన్నట్టు సమాచారం. ఉమ్మడి జిల్లాకు సంబంధించి పార్టీ అభ్యర్థుల ఎంపిక విషయంలో అచ్చెన్న పాత్రపై ఒకానొక దశలో చంద్రబాబు కొంత సీరియస్ అయినట్లు తెలిసింది.

అదీగాక అమరావతిలో ఎన్నికల సమయంలో మూడు పార్టీల సమన్వయ సమావేశాలకు పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా ఉన్న అచ్చెన్నాయుడిని పిలవకుండా పక్కనపెట్టారని టిడిపిలోని ఆయన వ్యతిరేకులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన్ను కేబినెట్‌లోకి తీసుకోవడం సందేహమేనని పలువురు టిడిపి నాయకులు చెప్తున్నారు. అదీగాక ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడుకు కేంద్ర కేబినెట్‌లోకి తీసుకుంటారన్న చర్చ బలంగా వినిపిస్తోంది. అదే జరిగితే ఒక ఇంట్లో రెండు పదవులు దక్కే అవకాశం ఉండదన్న చర్చ నడుస్తోంది.

యువత కోటాలో ఎవరికి దక్కేను?

కూన రవికుమార్

యువత కోటాలో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ పేరును ప్రధానంగా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఇచ్ఛాపురం నుంచి వరుసగా మూడు పర్యాయాలు గెలవడం, క్లీన్ ఇమేజ్ ఉండడంతో ఆయనకు ప్రాధాన్యం ఇస్తారనే చర్చ నడుస్తోంది. ఆమదాలవలస నుంచి ఎన్నికైన ఎమ్మెల్యే కూన రవికుమార్‌కూ మంత్రి పదవి వస్తుందని ఆయన అనుచరులు ఆశిస్తున్నారు. 2014 ఎన్నికల్లో తొలిసారిగా గెలిచిన కూన రవికుమార్‌కు పార్టీ అధిష్టానం ప్రభుత్వ విప్ పదవి అప్పగించింది. దీంతో ఈసారీ తమ నేతకు అవకాశం దక్కవచ్చని ఆయన అనుచరులు భారీగా ఆశలు పెట్టుకుంటున్నారు. కూన రవికుమార్, బెందాళం అశోక్ ఇరువురూ కళింగ సామాజిక తరగతి కావడంతో, ఇద్దరిలో ఒక్కరికే పదవి వచ్చే అవకాశం ఉందనే చర్చ నడుస్తోంది.

కేంద్ర కేబినెట్‌లో ఎంపీకి అవకాశం లభించేనా?

శాసనసభలో భారీ మెజార్టీని సాధించిన టిడిపి 16 ఎంపీ సీట్లలో విజయం సాధించి ఎన్‌డిఎలో రెండో అతి పెద్ద పార్టీగా ఉంది. దీంతో కేంద్ర ప్రభుత్వంలో ఆ పార్టీ కీలకపాత్ర పోషించనుంది. ఇప్పటికే టిడిపి జాతీయాధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ప్రధాని మోడీ ముందు పది మంత్రి పదవులు కావాలని డిమాండ్ ఉంచినట్లు తెలిసింది. బిజెపి మాత్రం రెండు కేబినెట్, డిప్యూటీ స్పీకర్ ఇచ్చేందుకు సిద్ధమైనట్లు వార్తలు వస్తున్నాయి. టిడిపికి దక్కే బెర్తుల్లో ఒకటి ఎంపీ రామ్మోహన్‌నాయుడుకి రావచ్చన్న ప్రచారం నడుస్తోంది. శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి వరుసగా మూడుసార్లు ఎంపీగా గెలవడం, చంద్రబాబుకు అత్యంత నమ్మకస్తుండడం ప్రధాన కారణాలు కనిపిస్తున్నాయి.

వీటితోపాటు ప్రస్తుతం టిడిపి నుంచి గెలిచిన వారిలో అధిక శాతం మంది కొత్తవారు కావడం, వైసిపి నుంచి టిడిపిలో చేరి గెలవడం వంటి అంశాల నేపథ్యంలో రామ్మోహన్‌నాయుడుకి సానుకూల అంశాలుగా మారాయన్న చర్చ రాజకీయవర్గాల్లో వినిపిస్తోంది. రాష్ట్ర కేబినెట్‌తో పాటు కేంద్ర కేబినెట్‌లో జిల్లాలో ఎవరికి బెర్తులు దక్కనున్నాయో తెలియాలంటే మరికొద్ది రోజులు వేచి చూడాల్సి ఉంది.

మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

సమన్వయం, సమిష్టి కృషితోనే సక్సెస్

జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పట్నుంచీ కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల నిర్వహణలో పలు శాఖల సహాయ, సహకారాలు, భాగస్వామ్యం మరువలేనిదని జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. కౌంటింగ్ ప్రశాంతంగా, సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కరినీ అభినందించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయం, సమిష్టి కృషితోనే ఎన్నికల నిర్వహణ విజయవంతమైందన్నారు. జిల్లాలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఎన్నికల నిర్వహణపై మంచి పరిజ్ఞానం ఉన్న బృందం తనకు లభించిందని తెలిపారు. ఆరు నెలలుగా బిఎల్‌ఒలు ఇంటి ఇంటికీ వెళ్లి సర్వే నిర్వహించారన్నారు. పోలింగ్ తర్వాత కౌంటింగ్ కూడా డిబ్రీఫింగ్ నిర్వహించినట్లు తెలిపారు. బిఎల్‌ఒ, మండలం, డివిజన్, జిల్లా స్థాయి అందరు అధికారుల, పోలీస్ అధికారులు సమన్వయంతో ఎన్నికల ప్రక్రియ విజయవంతమైందని చెప్పారు. ఈ ప్రక్రియలో జాయింట్ కలెక్టర్, డిఆర్‌ఒ కీలకపాత్ర పోషించారని కొనియాడారు. ఎన్నికల నిర్వహణలో పాల్గొన్న ప్రతి అధికారి నిష్పక్షపాతం, నిబద్ధతతో విధులు నిర్వహించారన్నారు. కౌంటింగ్ విజయవంతం చేయడంలో, హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా అడ్డుకట్ట వేయడంలో ఎస్‌పి కీలక బాధ్యతలు పోషించారని కొనియాడారు. సబ్ కలెక్టర్, ఆర్‌ఒలు చేసిన కృషి, నాలుగు నెలలుగా నోడల్ అధికారులు అంకితభావం చేపట్టిన విధులు ఇవన్నీ పోలింగ్, కౌంటింగ్ పూర్తి విజయవంతం చేయడానికి సహకరించాయన్నారు. ఎన్నికల కమిషన్ విధివిధానాలు ప్రతిఒక్కరూ దృష్టిసారించి విధులు సక్రమంగా నిర్వహించారన్నారు.

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ పోలింగ్, కౌంటింగ్‌లో ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా సమన్వయంతో పనిచేసి విజయానికి ప్రతిఒక్కరూ ముందుకు వచ్చారన్నారు. శిక్షణా తరగతుల్లో అందరు సమన్వయంతో పనిచేశారని కొనియాడారు. శిక్షణా తరగతులు అందరికీ ఉపయోగపడ్డాయన్నారు. నిర్దేశించిన పనులు ప్రతిఒక్కరూ అంకితభావంతో పనిచేయడం ఈ విజయానికి కారణమన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాట్లు చేసిన సంబంధిత నోడల్ అధికారులను ప్రశంసించారు.

కౌంటింగ్ నిర్వహణలో పలు అధికారులు వారి అనుభవాలను పంచుకున్నారు. కొన్ని సందర్భాల్లో కష్టమైనా తాజా ఫలితం ఎంతో ఆనందాన్ని ఇస్తుందన్నారు. చిన్న చిన్న అంశాల్లో సైతం కలెక్టర్ సీరియస్‌గా స్పందించిన విషయాలు క్షేత్రస్థాయిలో తమకు ఎంతగానో ఉపయోగపడ్డాయని చెప్పారు. ఉదయం ఐదు నుంచి రాత్రి 11 గంటల వరకు అక్కడే ఉన్న కలెక్టర్ వ్యవహరించిన విధానాన్ని, సున్నితమైన అంశాలపై ఆయన స్పందించిన తీరును పలువురు నోడల్ అధికారులు కొనియాడారు. సమావేశంలో సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు, రిటర్నింగ్ అధికారులు సుదర్శన్ దొర, భరత్‌నాయక్, అప్పారావు, సిహెచ్.రంగయ్య, లక్ష్మణమూర్తి, రామ్మోహనరావు, నోడల్ అధికారులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

విత్తనాలను సిద్ధంగా ఉంచాలి

- ఆర్‌బికెల్లో ఎరువులు, పురుగుమందులను అందించాలి
- జీడికి మద్దతుధర ప్రకటించాలి
- రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ



మాట్లాడుతున్న రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యనారాయణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రైతుభరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను సిద్ధంగా ఉంచాలని ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్రాపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. నగరంలోని రైతుసంఘం జిల్లా కార్యాలయంలో ఆ సంఘ విస్తృతస్థాయి సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నా, రైతుభరోసా కేంద్రాల్లో వరి విత్తనాలు లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారని చెప్పారు. వరి విత్తనాలతో పాటు మొక్కజొన్న, పత్తి, వేరుశనగ విత్తనాలనూ రైతులకు అవసరమైన మేరకు రైతుభరోసా కేంద్రాల ద్వారా అందించాలన్నారు. ఎరువులు, పురుగుమందులు రైతుభరోసా కేంద్రాల్లో అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ఇరిగేషన్ అధికారులు సాగునీటి కాలువల మరమ్మతులు చేసి రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాన్నారు. ఐదేళ్లుగా సాగునీటి కాలువల మరమ్మతుల్లేక కాలువల్లో గుర్రపుడెక్క, తూటికాడ తదితర వాటితో నిండిపోయిందని తెలిపారు. వాటిని తొలగించి కాలువల మరమ్మతులు చేయాలని పలుమార్లు ఆందోళన చేసినా గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. జిల్లాలో ప్రధాన సాగునీటి వనరైన వంశధార కుడి, ఎడమ కాలువల మరమ్మతుల్లేక శివారు భూములకు నీరందడం లేదని విమర్శించారు.

కొత్త ప్రభుత్వమైనా ఇరిగేషన్, మైనర్ ఇరిగేషన్ కాలువల మరమ్మతులు పూర్తి చేసి తక్షణమే నీరందించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి అవసరమైన పెట్టుబడులు బాగా పెరిగాయని, అందుకనుగుణంగా బ్యాంకుల ద్వారా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి రైతులందరికీ రుణాలు మంజూరు చేయాలన్నారు. నాలుగేళ్లుగా మద్దతు ధర లేక జీడి రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని చెప్పారు. కొత్త ప్రభుత్వం ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేసి జీడి పంటకు మద్దతు ధరను ప్రకటించాలని, రైతుభరోసా కేంద్రాల ద్వారా జీడిపంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు పొందూరు చంద్రరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, జిల్లా ఉపాధ్యక్షులు కె.కొండయ్య, బి.వాసు, టి.అజయ్ కుమార్, వెలమల రమణ, టి.నందోడు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా కౌంటింగ్ ప్రక్రియ పూర్తి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అన్ని శాఖల సమన్వయంతో ప్రశాంతంగా పూర్తి చేశామని ఎస్‌పి జి.ఆర్ రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. సమర్థవంతంగా విధులు నిర్వహించిన హోంగార్డు నుంచి డిఎస్‌పి స్థాయి అధికారులు, ఎఎస్‌పిలు ప్రేమ్‌కాజల్, ఉమామహేశ్వరరావు, గంగాధరం, కేంద్ర బలగాలు, ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సిసి, విశ్రాంత సైనికోద్యోగులతో పాటు ఇతర జిల్లాలకు చెందిన అదనపు బలగాలను అభినందించారు. గత నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికలతో పాటు ఈనెల నాలుగో తేదీన కౌంటింగ్ ప్రక్రియను శాంతియుతంగా పూర్తయిందని తెలిపారు. జిల్లాలో శాంతియుత వాతావరణం నెలకొల్పేలా జిల్లా పోలీస్ శాఖ అన్ని చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

మాస్టర్ ట్రైనర్ శేషగిరికి అభినందన

శ్రీకాకుళం అర్బన్ : ఎన్నికల విధులు నిర్వహించిన అధికారులు, సిబ్బందికి శిక్షణనిచ్చిన జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్, ఉపాధ్యాయుడు కె.శేషగిరిరావును కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అభినందించారు. జిల్లాకు వచ్చిన ఎన్నికల పరిశీలకుల సంతకాలతో కూడిన అభినందన ప్రశంసాపత్రాన్ని కలెక్టరేట్‌లో గురువారం అందజేశారు. శేషగిరి ప్రస్తుతం గార మండలం ఉప్పరవానిపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. విజయవాడలో శిక్షణ పొందిన ఆయన జిల్లాస్థాయి ఎన్నికల నియమాలను, విధులను మాస్టర్ శిక్షకుని హోదాలో నాలుగు నెలలుగా అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. 2019లోనూ ఆయన శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గస్థాయి మాస్టర్ శిక్షకులుగా వ్యవహరించారు.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం

జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సమగ్రమైన ప్రాథమిక విద్యనందించడం ద్వారా సమాజ నిర్మాణానికి మంచి బాటలు వేయొచ్చని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. నగరంలోని పెద్దపాడు సాంఘిక సంక్షేమశాఖ రెసిడెన్షియల్ స్కూల్‌లో ప్రాథమిక విద్యనందించే ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు అకడమిక్ శిక్షణా తరగతులను గురురవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక విద్య వ్యవస్థకు పునాది వంటిదని, సమర్థవంతంగా ఈ విద్యనందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. రెండు రోజుల శిక్షణలో చిత్త శుద్ధితో మెలకువలు నేర్చుకోవాలని సూచించారు. 1, 2 తరగతుల విద్యార్థులకు తెలుగు, గణితంలో అందిస్తున్న విద్యలో మెలకువలను నేర్చుకోవాలన్నారు. జ్ఞానప్రకాష్ - 60 రోజుల శిక్షణా కార్యక్రమానికి జిల్లాలోని 30 మండలాల నుంచి 90మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసినట్లు తెలిపారు. వారికి గణితం, భాషకు సంబంధించిన పలు అంశాల్లో పూర్తిస్థాయిలో శిక్షణ ఇస్తున్నట్టు వివరించారు. ఈ తరగతులకు సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి గుంట లక్ష్మీనారాయణ కోర్సు డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. నరసన్నపేట, పాతపట్నం ఎంఇఒలు దాలినాయుడు, తిరుమలరావు, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు ప్రభాకరరావు, నళినీకాంత్ పరిశీలకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రథం జిల్లా కో-ఆర్డినేటర్ మురళీమోహన్, లీలామోహన్, అరుణ కుమారి, శివాజీ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

సాహస అవార్డుకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సాహస అవార్డుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు సెట్‌శ్రీ సిఇఒ బి.వి ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. భారత యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ద్వారా 2023 సంవత్సరానికి గానూ సాహస కృత్యాల్లో విశేష ప్రతిభ కనబరిచిన వ్యక్తుల నుంచి టెన్జింగ్ నార్వే జాతీయ సాహస అవార్డుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. 2021, 2022, 2023లో భూమి, నీరు (సముద్రం), గాలిలో చేసిన సాహస కార్యకలాపాలు, జీవిత కాలంలో చేసిన సాహస కార్యక్రమాల్లో అత్యుత్తమ విజయాలు సాధించిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సాహస క్రీడల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించిన వ్యక్తులకు జీవితకాల సాఫల్యం కింద ఈ అవార్డును రాష్ట్రపతి చేతుల మీదుగా బహుకరిస్తారని తెలిపారు. అవార్డు గ్రహీతలకు 'టెన్జింగ్ నార్వే' కాంస్య విగ్రహంతో పాటు ప్రశంసాపత్రం, బ్లేజర్, రూ.15 లక్షల నగదును అందజేస్తారని పేర్కొన్నారు. ఈనెల 14వ తేదీలోగా https//awards.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9182908248 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.

మరువద్దు... ముందు చూపు

- పెరుగుతున్న గ్లకోమా బాధితులు
- ఆలస్యంగా గర్తించడం వల్లే అంధత్వం
- పరీక్షల్లో బయటపడుతున్న కేసులు



ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కంటి జబ్బులో ప్రమాదకరమైనది గ్లకోమా (నీటికాసుల వ్యా ధి). దీని లక్షణాలు బయటకు కనిపించవు. 90 శాతం మందికి ఇది వచ్చిన విషయం కూడా తెలియదు. కంటి పరీక్షలు చేసినప్పుడు తెలుస్తుంది. నిశ్శబ్దంగా శాశ్వత అంధత్వాన్ని తెస్తుంది. దీని బారిన పడుతున్న బాధితుల సంఖ్య జిల్లాలో ఎక్కువగానే ఉంటోంది. ఒత్తిడి తీవ్రంగా ఉన్నప్పుడు రక్తం నుంచి విడుదలయ్యే ఆక్వియస్ హ్యూమర్ అనే ద్రవం కంట్లో నిలిచిపోవడం వల్ల ఈ వ్యాధి పుట్టుకొస్తోంది. ప్రతి వంద మందిలో ముగ్గురు ఈ వ్యాధి బారిన పడుతున్నట్లు వైద్యులు గుర్తించారు. కొందరు ఆలస్యంగా ఆస్పత్రులకు వస్తుండడంతో కంటిచూపును కోల్పోతున్నారు.

గ్లకోమా సోకడానికి కారణాలు ఇవే...

వయసు ఆధారంగా, వంశపారంపర్యంగా ఈ వ్యాధి రావచ్చు. పక్క చూపు క్రమేపీ తగ్గుతుంది. కన్ను తరచూ ఎరుపుగా మారడం, అప్పుడప్పుడు నొప్పిగా అనిపించడం.. కంటి నరంపై ఒత్తిడి పెరగడం వల్ల, స్టెరాయిడ్స్, డ్రాప్స్, మందులు ఎక్కువ కాలం వినియోగించినా గ్లకోమా వచ్చే అవకాశం ఉంది. గ్లకోమా బారిన పడితే కొంతమంది రెండేళ్లలో, మరికొంతమంది ఐదేళ్లలో చూపు కోల్పోతున్నారు. తరచూ కళ్లల్లో నీరు కారడం, నల్లగుడ్డు తెల్లగా మారడం వంటి లక్షణాలు ఈ వ్యాధి సోకిందనడానికి సూచికలు. రోగులకు సకాలంలో శస్త్రచికిత్సతో పరిష్కారం లభిస్తుంది.

శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజనాస్పత్రి, సోంపేటలో ఉన్న ఆరోగ్య వరం కంటి ఆస్పత్రిలో గ్లకోమా బాధితులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ రెండు చోట్లా ప్రతినెలా శస్త్రచికిత్సలు చేస్తున్నారు. అవసరమున్న వారికి కార్నియా ద్వారా చూపు వచ్చేలా శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. దాతల నుంచి సేకరించిన కార్నియాతో కొంతమందికి చూపు వస్తోంది.

రెడ్‌క్రాస్ ద్వారా కార్నియా సేకరణ

రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన నేత్రదాతల మరణానంతరం నేత్రనిధి ఆధ్వర్యాన కార్నియాలను సేకరించి భద్రపరుస్తున్నారు. వీటిలో ఆరోగ్యవంతమైన కార్నియాలను కార్నియా మార్పిడి శస్త్రచికిత్స ద్వారా అంధులకు అమర్చి చూపు తెప్పిస్తున్నారు. ముందుగా అంధులు కంటి ఆస్పత్రిని సందర్శించి వైద్య పరీక్షలు చేయించుకున్న తర్వాత కార్నియా మార్పిడితో వారికి చూపు వచ్చే అవకాశం ఉందంటే అలాంటి వారి పేర్లను నమోదు చేస్తారు. దాత నుంచి కార్నియాలు సేకరించిన తర్వాత వరుస క్రమంలో శస్త్రచికిత్స చేసి అమరుస్తున్నారు.

కంటి వైద్య పరీక్షలు తప్పనిసరి

40 ఏళ్లు దాటిన వారంతా విధిగా పరీక్షలు చేయించుకోవాలి. రెటీనాను పరీక్షించి గ్లకోమా ఉందో లేదో వైద్యులు నిర్ధారిస్తారు. మధుమేహం, రక్తపోటు, గ్లకోమా వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగా పరీక్షలకు శ్రద్ధ చూపాలి. బిపి, షుగర్‌ను అదుపులో ఉంచుకోవాలి. ఒత్తిడికి లోను కాకూడదు. స్టెరాయిడ్స్‌కు దూరంగా ఉండాలి. చక్కటి పోషకాహారాన్ని తీసుకుని కళ్లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి.

- డాక్టర్ బి.మీనాక్షి,
జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి

పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధికారులు

ఎమ్మెల్యే శిరీషకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి- పలాస

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గౌతు శిరీష ఎమ్మెల్యేగా గెలుపొందడంతో మూడు రోజులుగా నియోజకవర్గ కార్యకర్తలు, ప్రభుత్వ ఉద్యోగులు, స్థానిక వ్యాపారులు, అభిమానులు తరలి వస్తున్నారు. ఈ మేరకు గురువారం టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే శిరీషను, నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు డాక్టర్ సిహెచ్.చిన్నంనాయుడు, డాక్టర్ దంతం భీమారావు, స్థానిక వైశ్య సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు మల్లా భాస్కరరావు, సభ్యులు కొత్తకోట తిరుమలరావు, వి.ఎల్.ఎన్.రాజు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, టంకాల రవిశంకర్ గుప్తా, మల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

షిర్డీ ఆలయం సందర్శన

స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని షిర్డీ ఆలయాన్ని ఎమ్మెల్యే గౌతు శిరీష, వెంకన్నచౌదరి దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆమెకు దుశ్శాలువ కప్పి సన్మానించారు.

అవగాహన కల్పిస్తున్న కిరణ్‌కుమార్

రైల్వే గేటు వద్ద నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ రైల్వే గేట్లు వద్ద వాహనదారులు భద్రతా నియమాలు పాటించి రైల్వే అధికారులకు సహకరించాలని లోకో ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ కోరారు. కాశీబుగ్గ రైల్వే గేటు వద్ద రైల్వే భద్రతావారోత్సవాల్లో భాగంగా గురువారం మధ్యాహ్నం రైల్వే గేటు వద్ద ప్రజలకు అవగాహన కల్పించారు. రైల్వేగేట్లకు ఢీకొని రైలు పట్టాలకు ఎటువంటి నష్టం కలిగించినా రైల్వే చట్టాలు కఠినంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. గేటు వేసే ముందు సైరన్ మ్రోగుతుందని, దానిప్రకారం గేటుకు దూరంలో వాహనాలు నిలుపుదల చేయాలని సూచించారు. గేటు వేసే సమయంలో ముందుగా వాహనాలు వెళ్లకూడదని, దీనికి భారీ జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ ఎస్.దాస్, డిటిఐ కె.భగవతిరావు, ఆర్‌పిఎఫ్ ఓసి ఎం.మహాపాత్రో, ఆర్.రమేష్, కె.ఎస్.కుష్వహా పాల్గొన్నారు.

పేరుకే సాగరాలు...

నీరు లేక ఎండిన బగడ సాగరం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండల రైతాంగం ఏటా వర్షాధారంపై ఆధారపడి పంట సాగు చేస్తున్నారు. సాగునీరు అందించే సాగరాలు, చెరువులు అభివృద్ధి లేక నీటి సామర్థ్యం కోల్పోతున్నాయి. దీంతో రైతులకు సాగునీరందని దుస్థితి ఏర్పడుతుంది. చెరువులకు అనుసంధానంగా ఉండే ఛానల్ అభివృద్ధి లేక నీరు వెళ్లేందుకు అవకాశం లేకుండాపోతుంది. బగడ వద్ద ఉండే బగడ సాగరం అభివృద్ధికి దూరంగా ఉంది. పేరుకే సాగరమైనా చిన్నపాటి చెరువులా కనిపిస్తుంది. సాగరం విస్తీర్ణం 80 ఎకరాలు ఉండేది. సాగరం పరిధిలో 940 ఎకరాలకు సాగునీరు అందేది. ఆయకట్టు పరిధిలో 869 మంది సాగు రైతులు ఉన్నారు. సాగరం పరిధిలో ఐదు కిలోమీటర్ల సాగునీటి గడ్డ ఉంది. అలాగే సిస్ ఛానల్‌కు అనుసంధానంగా పెద్దగుమ్మడ, బాణాపురం, సృజిని, జాడిపల్లి, శేఖరాపురం, బురద, రామచంద్రపురం, పెద్దలక్ష్మీపురం సాగునీటి చెరువులకు ఈ ఛానల్ అనుసంధానంగా ఉంది. బగడసాగరం నుంచి ఈ ఛానల్ ద్వారా అనుసంధానంగా ఉండే చెరువుల్లోకి నీరు చేరి రైతులకు సాగునీరు అందాల్సి ఉంది. సాగరం గడ్డ ఇసుకమేట్లతో నిండి నీటి సామర్థ్యం కోల్పోయింది. అనుసంధానంగా ఉండే ఛానల్ ఇసుక మేట్లతో కూడుకుపోవడంతో ఛానల్ ద్వారా ప్రవహించే నీరు పొలాలకు వైపు నీరు చేరి మేట్లు వేయడంతో రైతులకు నష్టం వాటిల్లుతోంది. ఇసుక మేట్ల బారిన ప్రాంతంలో పంటలకు నష్టం వాటిల్లుతోంది. ఇసుక మేట్లను తొలగించేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. సాగరం ఛానల్ అభివృద్ధి చేస్తే సాగునీటి వసతి చేకూరుతుందని రైతులు చెబుతున్నారు. అలాగే ముకుందపురం వద్ద ముకుంద సాగరం, అలాగే భావనాపురం వద్ద గజపతి సాగరం, నేలవంత సాగరం, ముక్తాపురం పెద్ద చెరువు అభివృద్ధి లేక దయనీయంగా ఉన్నాయి. సాగరాలో చెరువులో అభివృద్ధి చేస్తే రైతంగానికి సాగునీటి వసతి చేకూరుతుందని ఆయా ప్రాంతాలకు చెందిన రైతులు చెబుతున్నారు.

శివారు ప్రాంతాలకు నీరందడం లేదు

సాగరం ఉన్న శివారు పంటలకు నీరు అందడం లేదు. రైతులకు సాగునీరు అందించే బగడ సాగరం అభివృద్ధి చేయాలి. సాగరం నిండా నీరు నిల్వ ఉంటే ఏడాదికి మూడు పంటలు పండించుకుంటాం. సాగరం ఆక్రమణలకు గురికావడంతో వర్షాధారంపై ఆధారపడవలసి వస్తోంది.

- బూర్ల లలిత కుమారి, టిడిపి జిల్లా మహిళా ఉపాధ్యక్షులు

సాగరాలను అభివృద్ధి చేయాలి

రైతుల ప్రభుత్వం అనే చెప్పుకుంటున్న టిడిపి ప్రభుత్వం బగడసాగరం అభివృద్ధి చేయాలి. ఈ సాగరం అభివృద్ధి చేస్తే రైతులు ఏటా మూడు పంటలు పండించుకుంటారు. కూలీలకు పని దొరుకుతుంది. దీంతో వలసలు కూడా నివారించవచ్చు. ప్రభుత్వం స్పందించి సాగునీటి పథకాలపై దృష్టి సారించాలి.

- పోలాకి ప్రసాదరావు, కౌలు రైతుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు

దాతల కోసం ఎదురుచూపు

అరుదైన వ్యాధితో బాధపడుతున్న బాలుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ముద్దు ముద్దు మాటలు... చిన్నారి బోసి నవ్వులు.. అల్లరిగా ఆనందంగా గడపాల్సిన ఆరేళ్ల బాలుడు విధి రాతతో పోరాటం చేస్తున్నాడు. అరుదైన వ్యాధితో బాధపడుతూ బాలుడు కష్టాన్ని చూసి ఓర్వలేక తలిదండ్రులు రోదిస్తున్నారు. బాలుడిని బాగా చూసుకుని మురిసిపోవాల్సిన తల్లిదండ్రులు ఆర్థికసాయం కోసం ఎదురు చూస్తున్నారు. బూర్జ మండలం మద్రిపాడుకు చెందిన జంపా త్రినాథరావు, గాయత్రిల కుమారుడు జంపా చైతన్య ఆరేళ్ల వయసు. అల్లారు ముద్దుగా పెంచుకున్న కుమారుడు అరుదుగా వచ్చే పోస్ఎస్ఎస్ఇ అనే వ్యాధితో ఐదేళ్ల నుంచి బాధపడుతున్నారు. చిన్నారుడిని చికిత్స నిమిత్తం శ్రీకాకుళం స్థానిక బొగ్గు సరోజినీదేవి వైద్యశాలలో చూపించిగా, బాలుడిని పరిశీలించిన వైద్యులు, విశాఖపట్నంలోని ఆర్కె వైద్యాశాలకు తీసుకువెళ్లాలని సూచించడంతో ఈ వ్యాధి బయటపడింది. ఇ వ్యాధికి ఆరోగ్యశ్రీ వర్తించకపోగా తండ్రి పేద కుటుంబం కావటంతో ఉన్న ఇంటిని, బయట ఇప్పటివరకు అప్పులు చేసి కుమారుని వైద్యం కోసం నెట్టుకొచ్చారు. బాలుడు నడవలేదు, కూర్చోలేడు, తినలేడు, మాట్లాడలేడు, వినిపించినా వినపడనట్లే ఉండి గుండెలు కొట్టుకుంటాడని తల్లితండ్రులు వాపోయారు. ఇదిలా ఉంటే పూర్తిగా వ్యాధి నయమయే మార్గాలు చాలా తక్కువ. దీనికి పూర్తి మందులు కూడా లేవని వైద్యులు చెప్పటంతో, కొంత మంది వైద్యుల సలహాతో పూణేలో సెంటర్ ఫర్ లైఫ్ సైన్సస్ హోమియో తెరపీ డాక్టర్ వస్వల్ గున్వంత్ ఆధ్వర్యాన చికిత్స పొందుతున్నారు. వెళ్లి అక్కడ ఉండే స్థోమత లేక వైద్యుల సలహా మేరకు నెలకొకసారి బాబుతో పాటు పూణే వెళ్లి వస్తున్నారు. ప్రతినెలా సుమారు మందులకు రూ.15 వేలు ఖర్చు అవుతుందని తల్లితండ్రులు తెలిపారు. దాతలు సహాయపడాలనుకుంటే నేరుగా 9502254379 ఫోన్ పే, గూగుల్ పే ద్వారా ఆదుకోవాలని కోరుతున్నారు.

10న బొడ్డపాడులో సదస్సు

ప్రజాశక్తి- పలాస

కమ్యూనిస్టులు, విప్లవ ప్రజా సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక ఆధ్వర్యాన 10న మండలంలోని బొడ్డపాడు అమరవీరుల స్మారక భవనంలో ఉదయం 9 గంటలకు సదస్సు, సమావేశం నిర్వహిస్తున్నట్లు కమ్యూనిస్టు, విప్లవ ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. ఈ మేరకు బొడ్డపాడులో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఫాసిస్టు హిందూ మతోన్మాద భావజాల ప్రభావానికి సమాజం గురవుతుందని అన్నారు. ఈ కీలక సందర్భంలో ఇటువంటి వేదికల ద్వారా ప్రజలకు వాస్తవాలను చెప్పి చైతన్యపర్చాల్సిన బాధ్యత, కర్తవ్యంమని అన్నారు. ఈ సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పిఒడబ్ల్యు జిల్లా కార్యదర్శి పోతనపల్లి కుసుమ, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకులు తామాడ సన్యాసిరావు, మద్దిల రామారావు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు పోతనపల్లి కుసుమ, గొరకల బాలకృష్ణ, ఎపిసియల్సి జిల్లా నాయకులు పత్తిరి దానేసు, ఢిల్లీరావు, ప్రజా కళామండలి నాయకులు కొర్రాయి నీలకంఠం, అరుణ, పిడియం నాయకులు సాలిన వీరాస్వామి పాల్గొన్నారు.

వ్యక్తి హత్య

కొర్లాం దాబాలో ఘటన

రాంబాబు మృతదేహం

ప్రజాశక్తి- సోంపేట

మండల పరిధిలోని కొర్లం జాతీయ రహదారి వద్ద ఉన్న సంగీత దాబాలో పనిచేస్తున్న ఇద్దరు వ్యక్తుల మధ్య తాగిన మైకంలో జరిగిన ఘర్షణ హత్యకు దారితీసింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక సంగీత దాబాలో పోలాకి మండలం చల్లాయివలసకి చెందిన మాడుగుల రాంబాబు, ఇచ్ఛాపురం మండలం కొలిగాంకు చెందిన సూర్యనారాయణ మహంతి పనిచేస్తున్నారు. వీరిద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. యజమాని వారిద్దరని మందలిస్తూ ఉండేవారు. కానీ, వారిలో మార్పు రాలేదు. బుధవారం రాత్రి హోటల్ మూసివేసిన తర్వాత పడుకునే సమయంలో వారిద్దరి మధ్య మళ్లీ వాగ్వాదం చోటుచేసుకుంది. తాగిన మైకంలో ఉన్న సూర్యనారాయణ మహంతి, పడుకొని ఉన్న రాంబాబుపై రాయితో బలంగా కొట్టాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో రాంబాబు (51) అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న హోటల్ యజమాని గణపతి వెంటనే బారువ పోలీసులకు తెలియజేశారు. సోంపేట సిఐ మల్లేశ్వరరావు, బారువ ఎస్ఐ చంద్రశేఖర్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. సంఘటనపై గణపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. వారు ఒడిశా రాష్ట్రం కటక్ ఉంటున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిఆర్‌పిఎఫ్ జవాను మృతి

తేజేశ్వరరావు (ఫైల్)

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మణిపూర్ రాష్ట్రంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టెక్కలికి చెందిన మెట్ట తేజేశ్వరరావు (33) సిఆర్‌పిఎఫ్ జవాన్ మృతి చెందాడు. ఎన్నికల కౌంటింగ్‌కు హాజరై తిరిగి తమ బెటాలియన్‌తో కలిసి వాహనంలో వస్తున్నారు. ఈ సమయంలో వెనుక నుంచి వచ్చిన లారీ బలంగా ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన తేజేశ్వరరావు మృతి చెందాడు. దీంతో జవాన్ కుటుంబంలో విషాదం నెలకొంది. మృతదేహాన్ని టెక్కలి తీసుకువచ్చే ఏర్పాట్లు చేస్తున్నారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు.

పూలమాలలతో సత్కరిస్తున్న సభ్యులు

ఎమ్మెల్యే అశోక్‌కు సన్మానం

కవిటి: ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. నియోజకవర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు స్థానిక ప్రజానీకం కూడా వెల్లువలా వచ్చి ఎమ్మెల్యే అశోక్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. దీంతో బుధవారం సాయంత్రం నుంచి ఆయన తీరిక లేకుండా గడుపుతున్నారు.

సన్మానిస్తున్న అధ్యాపకులు

రామ్మోహనరావు సేవలు మరువలేనివి

పొందూరు: పౌరశాస్త్ర అధ్యాపకునిగా నంద రామ్మోమోహనరావు అందజేసిన సేవలు కొనియాడదగినవని సర్పంచ్ పైడి రాంప్రసాద్, ఎంపిటిసి కూటికుప్పల హనుమంతురావులు అన్నారు. మండలంలోని కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాల పౌరశాస్త్ర అధ్యాపకునిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన రామ్మోహనరావుకు ప్రిన్సిపాల్ జె.సునీత అధ్యక్షతన గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఉన్నతికి ఆయన అందించిన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు బి.వి.రమణమూర్తి, పి.చిరంజీవి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా నియంత్రణకు చర్యలు

ఆమదాలవలస : మలేరియా వ్యాధి నియంత్రణకు ముందస్తుగా అన్ని చర్యలు తీసుకున్నామని జిల్లా మలేరియా అధికారి పి.వి.సత్యనారాయణ తెలిపారు. మండలంలోని వెన్నెలవలస, గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో గురువారం దోమల నియంత్రణకు ఎసిఎం మందును వైద్య సిబ్బందితో స్ప్రే చేయించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.సంతోష్‌కుమార్, సిహెచ్ఒ డి.మోహనరావు, సబ్ యూనిట్ అధికారి ఎం.ఆచారి, ఎంఎల్‌హెచ్ పి.రుక్మిణి, ఎఎన్ఎం ఈశ్వరమ్మ, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తుడ్డలిలో అన్నదానం

బూర్జ : మండలంలోని తుడ్డలిలో షిర్డీ ఆలయంలో సిహెచ్.జగన్నాథశర్మ ఆధ్వర్యాన గురువారం అన్నదానం చేశారు. కురుంపేటకు చెందిన లలిత మోహనరావు, మీనాక్షి, వెంకట శివ సీతారామరాజు, జ్యోతిస్వరూప దంపతులు ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత కనపాక చౌదరినాయుడు, కిమిడి రామ్మూర్తి, నాయుడు, వండాన కూర్మారావు పాల్గొన్నారు.

వికలాంగ విద్యార్థుల గుర్తింపు

ఎల్ఎన్‌పేట : భవిత కేంద్రంలో వికలాంగ విద్యార్థులకు మంచి బోధనతో పాటు జీవన నైపుణ్యాన్ని అలవార్చుతారని ఎంఇఒ సిహెచ్.మణికుమార్, ఎంఇఒ-2 చంద్రమౌళి తెలిపారు. ఈ సందర్భంగా భవిత కేంద్రం రిసార్ట్స్ టీచర్స్ డి.శ్రావణిసంధ్య, ఎస్.సురేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 30 మంది చిన్నారులను గుర్తించినట్లు తెలిపారు.

వివరాలను సేకరిస్తున్న రిసోర్స్ టీచర్లు

ఎమ్మెల్యే 'ఎన్ఇఆర్'కి అభినందనలు

పుష్పగుచ్ఛం అందజేస్తున్న పరిశ్రమ ప్రతినిధులు

ప్రజాశక్తి- రణస్థలం

పైడిభీమవరం పారిశ్రామికవాడకు చెందిన పలు కంపెనీల ప్రతినిధులు ఎచ్చెర్ల ఎమ్మెల్యేగా ఎన్నికైన నడుకుదిటి ఈశ్వరరావుని గురువారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ పరస్పర సహకారంతో నియోజకవర్గం అభివృద్ధికి, కలిసి పనిచేయడానికి ముందుకు రావాలని అన్నారు. స్థానిక యువకులకు కంపెనీల్లో అవకాశం కల్పించే దిశగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని అన్నారు. అనంతరం పరిశ్రమ అవసరాలకు తగ్గ ఉద్యోగాలను నియోజకవర్గ పరిధిలో అందించాలని కోరారు. సిఎస్ఆర్ యాక్టివిటీస్‌లో భాగంగా ప్రభుత్వ భాగస్వామ్యంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి తోడ్పడేలా పనిచేద్దామని కోరారు. అందుకు పరిశ్రమ ప్రతినిధులు తమ సహకారం అందిస్తామని తెలియజేశారు. సమావేశంలో శ్రేయాస్ ఫార్మా డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, అపిటోరియస్ ఫార్మా కంపెనీ జనరల్ మేనేజర్ కమలాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పంచసూత్రాలే సంఘాల ప్రగతికి ఆధారం

ఎపిఎం కూర్మారావు

మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మహిళా స్వయంశక్తి సంఘాల ప్రగతికి పంచసూత్రాలే ప్రధానమని ఎపిఎం పైడి కూర్మారావు అన్నారు. మండలంలోని వెదుళ్లవలస గ్రామ సంఘం అధ్యక్షులు బత్తుల రాజు అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సంఘమూ నెలవారి సమావేశాలు, పొదుపు అప్పుల వసూలు, అవసరమేరకు అప్పులు వాడుకోవడం, తిరిగి చెల్లించడం, ఇంటర్నల్ లెండింగ్, బుక్ కీపింగ్ తదితర అంశాలను తుచ తప్పకుండా పాటించాలన్నారు. దీంతో సంఘాల ప్రగతికి, మీ సభ్యుల ఆదాయాభివృద్ధి కార్యక్రమాలకు అవసరం మేరకు కావలసిన అంత రుణం మంజూరు చేసే వీలు ఉంటుందని తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలూ పంచసూత్రాలు పాటించి బ్యాంకు రుణాలు పొందవచ్చునని సూచించారు. కార్యక్రమంలో క్లస్టర్ కో-ఆర్డినేటర్లు సుభద్ర, రామప్పడు, విఒఎ రమ పాల్గొన్నారు.

'ఉపాధి' ప్రదేశంలో టిడిపి సంబరాలు

స్వీట్ తినిపిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని జొన్నవలసలో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న చెరువులో కూలీలు, టిడిపి నాయకులు గురువారం సంబరాలు నిర్వహించారు. కూన రవికుమార్ ఎమ్మెల్యే విజయం సాధించడం తమకెంతో ఆనందంగా ఉందని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనిలో టిడిపి టోపీలు, కండువాలు ధరించి రవికుమార్ చిత్రపటాన్ని చెరువు పని మధ్యలో ఉంచి పసుపు రంగు కలిగిన కేకును కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసిపి పాలనలో ఉపాధి పనులు నిర్వహించడానికి అవసరమైన సామగ్రి, వేసవి అలవెన్స్ అందలేదని వారు ఆవేదన వెలిబుచ్చారు.

తాగునీరు వృథా

వృథాగా పోతున్న తాగునీరు

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్‌లో చాలాచోట్ల తాగునీటి పైపులు పాడవ్వడంతో నీరు వృథాగా పోతుంది. కాశీనగర్ ఎన్ఎసిలోని ఒకటి, రెండు, మూడు, నాలుగు వార్డుల్లోని ప్రజలకు తాగునీరు దొరకక విలవిలలాడుతున్నారని మూడో వార్డు కౌన్సిలర్ టి.చలపతిరావు తెలిపారు. కొన్ని చోట్ల నీరు లేకపోవడంతో దూరప్రాంతానికి వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోంది. ఎన్ఎసి కార్యాలయానికి సమీపం, నిత్యం రద్దీగా ఉండే రోడ్డు పక్కనే నీరు వృథాగా పోతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని వార్డు ప్రజలు వాపోతున్నారు.

వరి విత్తనాలు సిద్ధం

మెళియాపుట్టి : ఖరీఫ్ సమీపిస్తున్న తరుణంలో రైతులు తమకు అవసరమైన వరి విత్తనాలను గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల ఎఒ దానకర్ణుడు ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ అనంతరం 90 శాతం రాయితీపై విత్తనాలు సరఫరా చేస్తామని అన్నారు. ఇంద్ర, అమర, శ్రీధృతి, స్వర్ణ, శ్రీకాకుళం సన్నాల్, మరుటేరు సాంబ వంటి వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శంకర్ కార్యాలయం వద్ద కోలాహలం

అభినందిస్తున్న వాకర్సు

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

చరిత్రలో నిలిచిపోయే రికార్డు మెజారిటీని సాధించి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన గొండు శంకర్‌కు అభినందనలు చెప్పడానికి గురువారం కిష్టప్పపేటలో శంకర్ స్వగృహానికి కార్యకర్తలతో, ప్రజలతో హడావుడిగా మారాయి. నియోజకవర్గంలోని నలుమూలల నుంచి పెద్దఎత్తున తరలివచ్చిన శ్రేణులు, అభిమానులు గొండు శంకర్ అభినందనలు చెప్పడానికి ముంచెత్తారు. పూలదండలు వేసి, పుష్పగుచ్చాలు అందజేసి, శాలువాలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. తనపై అభిమానంతో తరలివచ్చి అభినందనలు తెలిపిన ప్రతిఒక్కరికీ శంకర్ కృతజ్ఞతలు తెలిపారు. శాసనసభ్యునిగా నిస్వార్థమైన సేవలందించి నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానని అన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం నియోజకవర్గంలో రికార్డుస్థాయి మెజారిటీ సాధించిన ఎమ్మెల్యే శంకర్ కొత్త సంప్రదాయానికి తెరతీశారని వాకర్సు అభినందించారు. గురువారం నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ప్రతి నిత్యం వాకింగ్‌కు వస్తున్న నగర వాసులను ఆయన కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఇండోర్ స్టేడియంలో క్రీడాకారులను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. స్టార్ వాకర్సు ఆధ్వర్యాన శంకర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో వాకర్సు గుప్త, శాసపు జోగినాయుడు, ఇందిరాప్రసాద్, క్రీడాకారులు సింహాద్రి నాయుడు, మల్ల అబ్బాయినాయుడు, రొక్కం భాస్కర్, రౌతు సంతోష్, టిడిపి నాయకులు మాదారపు వెంకటేష్, చిట్టి నాగభూషణం, కవ్వాడి సుశీల, సీపాన రమ, రెడ్డి సూర్యనారాయణ, తాళ్లూరి నవీన్, రోనంకి కళ్యాణ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఘన స్వాగతం

అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రజాశక్తి- పోలాకి

ఎమ్మెల్యేగా బగ్గు రమణమూర్తి గెలుపొందిన నేపథ్యంలో గురువారం నరసన్నపేటలో ర్యాలీ నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు పోలాకి మండలం మబగాంలో తన స్వగృహంలో భయిలుదేరి నరసన్నపేట పైడిపల్లి అమ్మవారిని దర్శించారు. అనంతరం కార్యకర్తలు, అభిమానులు మధ్య మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్చి సంబరాలు మాదిరిగా పార్టీ కార్యాలయానికి ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యకర్తల మధ్య కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో టిడిపి పోలాకి మండల అధ్యక్షుడు ఎం.వెంకట అప్పలనాయుడు, లుకలాపు రాంబాబు, తమ్మినేని భూషణరావు, ధర్మాన తేజ్‌కుమార్, చిన్నాల కూర్మినాయుడు, భైరి భాస్కరరావు, మెండ రాంబాబు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రజాతీర్పును శిరసావహిస్తా

పాతపట్నం : ప్రజా తీర్పును శిరసా వహిస్తానని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఓడినా ప్రజల వెంటనే తాను ఉంటానని, కార్యకర్తలెవరూ అధైర్యపడద్దని ధైర్యం చెప్పారు. ప్రజా సమస్యలపై కార్యకర్తలతో కలిసి నిరంతరం పనిచేస్తానని అన్నారు. తనకోసం పనిచేసిన నియోజకవర్గంలోని సర్పంచ్‌లకు, ఎంపిటిసిలకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్న రోజాలత

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

సరుబుజ్జిలి : పచ్చిరొట్ట విత్తనాల వల్ల పంటలకు క్రిములు కీటకాలు బెడద లేకుండా దిగుబడులు పెరుగుతాయని వెలుగు కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ కూన రోజాలత తెలిపారు. మండలంలోని ప్రకృతి వ్యవసాయ గ్రామం రావివలసలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యాన పచ్చిరొట్ట విత్తనాలను గురువారం రైతులకు ఉచితంగా అందజేశారు. వ్యవసాయ పనిముట్లు చోడి విత్తనాలు కూడా రైతులు కోరిన వెంటనే అందిస్తామని ఈ సందర్భంగా వెల్లడించారు. కార్యక్రమంలో పిఎన్ఎఫ్ తిరుపతిరావు టి.సుమ, విఒఎ మంగమ్మ, సిసి సూర్యనారాయణ పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి రాజీనామా

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

సాధారణ కార్యకర్తగా ఉన్న తనకు మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి సీడాప్ చైర్మన్ పదవి కల్పించారని శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ పదవితో విద్యార్థులకు స్కిల్ ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ కల్పించేందుకు శక్తిమేర చేయడంతో సంతృప్తినిచ్చిందని అన్నారు. ఈ పదవితో సమాజంలో గౌరవం కలిగిందన్నారు. ఈ పదవి వల్ల నియోజకవర్గంలో ఎంతోమందికి ఆరోగ్యశ్రీ సేవలు, సహాయం, ప్రజావసరాలు, సమస్యలు పరిష్కరించానని తెలిపారు.

రైతులకు రశీదు తప్పనిసరి

ప్రజాశక్తి- బూర్జ

రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు ప్రయివేటు డిపో డీలర్లు రశీదులు తప్పనిసరిగా ఇవ్వాలని మండల ఎఒ వి.రాజేశ్వరరావు ఆదేశించారు మండలంలోని కొల్లివలస, కురంపేట గ్రామాల్లోని రైతు డిపోలను గురువారం తనిఖీ చేశారు. ఈ మేరకు గోదాంల్లో ఉన్న విత్తనాలను పరిశీలించారు. స్టోర్ రిజిస్టర్ బుక్, బిల్లులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డీలర్ల వద్ద 900 వివిధ ప్రయివేట్ కంపెనీలకు బరువు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. వాటిని సేకరించి తేమ, మొలక శాతం కోసం సీడ్ టెస్టింగ్‌కు ఆముదాలవలస లాబొరేటరీ పంపించామని వివరించారు. ఈ సందర్భంగా రైతులకు విక్రయించేటప్పుడు వెరైటీ లార్డ్ నంబరుతో పాటు కూడుకున్న రసీదు తప్పనిసరిగా జారీ చేయాలని ఆదేశించారు. లేని పక్షంలో చట్టం 1966 లోబడి చర్చిలు తీసుకుంటామని హెచ్చరించారు.



బలగ : నీతి కథలు చెబుతున్న చిన్నారి

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులకు తెలుగు వ్యాకరణం, నీతి చంద్రిక, బల వినోదిని, చందమామ, బాలమిత్ర వంటి పుస్తకాల్లోని కథలు వినిపించారు. రిసోర్స్ పర్సన్, తెలుగు ఉపాధ్యాయులు ముద్దాడ మురళి తెలుగు వ్యాకరణం భోదించారు. శిబిరంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కుమార్‌రాజు పాల్గొని మాట్లాడుతూ పుస్తకాలు చదవడం, తాము నేర్చుకున్న అంశాలను వెంటనే రాసుకుని అవసరం వచ్చినప్పుడు మళ్లీ చదవడానికి ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ డిప్యూటీ లైబ్రేరియన్ శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ భాస్కరరాజా పాల్గొన్నారు.

బలగ : బలగ శాఖాగ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా గ్రంథాలయాధికారి పి.ఉగ్రసేను విద్యార్థులకు నీతి కథలు, పద్యాలపై పోటీ పెట్టారు. కథల పోటీలో ఆరో తరగతి విద్యార్థిని టి.నవ్యశ్రీ, తొమ్మిదో తరగతి విద్యార్థిని కె.నందిని ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారు, తెలుగు పద్యాలు పోటీలో ఏడో తరగతి విద్యార్థి డి.జోగేంద్రసాయి, ఏడో తరగతి విద్యార్థి కె.ఈశ్వర్‌సాయి ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారు. కార్యక్రమంలో సహాయకులు కె.అనిత పాల్గొన్నారు.

మెళియాపుట్టి : స్థానిక శాఖాగ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో ఎంఇఒ-2 ఎం.పద్మనాభరావు పాల్గొని గణితంపై మెళకువలు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధాకారి ఆర్.అనురాధ పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక శాఖాగ్రంథాలయాన్ని జిల్లా శాఖాగ్రంథాలయ కార్యదర్శి బి.కుమార్‌రాజు సందర్శించి రికార్డులను పరిశీలించారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా శాఖాగ్రంథాలయాధికారి టి.ఇందిర ఆధ్వర్యాన విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్, పాటలు, డాన్స్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది డి.లక్ష్మి పాల్గొన్నారు.